❖•❖•❖ 35 ❖•❖•❖

# యేసు త్రాగనొల్లని గిన్నె

*"వారు కపాలస్థలమను అర్థమిచ్చు గొల్గొతా అనబడిన చోటికి వచ్చి, చేదు కలిపిన ద్రాక్షారసమును ఆయనకు త్రాగనిచ్చిరి; గాని ఆయన దానిని రుచి చూచి, త్రాగనొల్లకపోయెను" (మత్తయి 27:33, 34).*

యేసు మేకులతో సిలువకు కొట్టబడుటకు కొన్ని క్షణములకు మునుపు, ఆయనకు కొంచెము ఉపశమనకారియైన పానీయమును, ఆయన శరీరము మేకులతో సిలువకు బిగించివేయబడినప్పుడు ఆయన అనుభవించగల భయంకరమైన బాధను మొద్దుబారజేయుటకు ఒక విధమైన ద్రాక్షారసము నిచ్చారు. ఆయన దానిని రుచి చూచి, తన ముఖమును ప్రక్కకు త్రిప్పుకొని, దానిని త్రాగనొల్లక, నోటిలో ఉండిన ఆ ద్రావకాన్ని ఉమ్మివేశాడు.

యేసు సిలువ మరణమునకు సంబంధించిన మూడు "గిన్నెలు" గూర్చి లేఖనములు పేర్కొనుచున్నాయి. ఆయన గెత్సేమనే తోటలో దేవుని *ఉగ్రత గిన్నె*ను సంపూర్ణ వాస్తవికతలో ఎదుర్కొన్నాడు. ఆయన దానిలో గల అంశాలను దగ్గరగా చూచుచు, "నా తండ్రీ, సాధ్యమైతే ఈ *గిన్నె* నాయొద్దనుండి తొలగిపోనిమ్ము; అయినను నా యిష్టప్రకారము కాదు, నీ చిత్తప్రకారమే కానిమ్ము" అని ప్రార్థించాడు (మత్తయి 26:39; నొక్కి చెప్పింది నాది). యేసు ఈ తోటలో అల్ప వ్యవధుల చొప్పున ప్రార్థించుచు చివరిసారి ప్రార్థన ముగించుకొని లేచినప్పుడు, ఈ గిన్నెను సంపూర్ణంగా సేవించుటకు ఆయన బద్ధుడయ్యాడు.

యేసు ఎదుర్కొన్న రెండవ గిన్నె *ఉపశమన గిన్నె,* మానసిక స్పష్టత లేకుండాచేయుచు, ఆయనను మొద్దుబారజేయు ప్రభావము చూపు గిన్నె బహుశ వారు పరిపాటిగా చేసియుండవచ్చును, ఒకరిని సిలువవేయబడు సమయంలో, వారిని సిలువకు మేకులతో దిగగొట్టబడునప్పుడు కలుగు ప్రారంభ బాధను మొద్దుబారజేయుటకు బాధితునికి ఏదో ఒక విధమైన ద్రావకము నిస్తారు. లెమూయేలు, "ప్రాణము పోవుచున్నవానికి మద్యము నియ్యుడి, మనో వ్యాకులముగలవారికి ద్రాక్షారసము నియ్యుడి" అని సామెతల గ్రంథం చివరి అధ్యాయంలో వ్రాస్తున్నాడు (సామెతలు 31:6). యెరూషలేములోని దయాహృదయులైన స్త్రీలు వాడుకచొప్పున మరణశిక్ష విధింపబడిన ఖైదీలు సిలువ వేయబడుదురనగా త్రాగునట్లు వారికి గోపరసము లేదా వేరే ఏదైనా మొద్దుబారజేయు గుణము గల ద్రావకము కలిపిన ద్రాక్షారసమును అందించేవారని యూదుల సాంప్రదాయం చెప్పుచున్నది.

యేసు సిలువపై శ్రమనొందుచుండిన ఆరు గంటల చిత్రవధా సమయము ముగింపుకు వచ్చుచుండినప్పుడు, ఆయన మరొక గిన్నె, శ్రాంతి పానీయము గల గిన్నె కొరకు అడిగాడు. సువార్తికుడైన యోహాను ప్రకారము యేసు, "దప్పిగొనుచున్నాను" అని చెప్పాడు (యోహాను 19:28). వారి ఉపయోగార్థం చేదు ద్రాక్షారసము గల ఒక పాత్ర సైనికులకు దగ్గరలోనే అందుబాటులో ఉన్నది. గనుక ఒక దయగల హస్తము దానిలో నుండి కొంచెము తీసి, ఒక స్పంజీని ముంచి, యేసు పెదవులకు అందించాడు. యేసు "యేసు ఆ చిరక పుచ్చుకొనెను" (యోహాను 19:30). యేసు సిలువ మీది నుండి చేసిన వ్యక్తిగత మనవి ఇదొక్కటి మాత్రమే,

సిలువకు సమీపంలో ఉండి యేసు తన దాహమును తీర్చుకొనునట్లు చేయుచుండిన ఆయన విన్నపమును విన్న ఎవరో ఒక పేరులేని వాని చేత అది తీర్చబడింది.

ఈ మూడింటిలోని రెండవ గిన్నె, త్రాగుటకు యేసు నిరాకరించిన గిన్నె గూర్చి, “చేదు కలిపిన ద్రాక్షారసమును ఆయనకు త్రాగనిచ్చిరి గాని ఆయన దానిని రుచి చూచి త్రాగనొల్లగపోయెను” అని మత్తయి చెప్పుచున్నాడు (మత్తయి 27:34). “అంతట బోళము కలిపిన ద్రాక్షారసము ఆయనకిచ్చిరి గాని ఆయన దాని పుచ్చుకొనలేదు” అని మార్కు వ్రాయుచున్నాడు (మార్కు 15:23). మత్తయి పేర్కొనుచున్న “gall” – ఆంగ్లములో – చేదును తెలియజేయు పదమై యుంటుంది, అలాగే మార్కు వ్రాయుచున్న “myrrh” – ఆంగ్లములో – అను పదము చేదు రుచినిచ్చు నిర్దిష్ట పదార్థమును పేర్కొనుచున్నది. బోళము, ఆయన మనస్సుకును శరీరమునకును కొంత తిమ్మిరి కలుగజేస్తూ, మాదకద్రవ్యంగా పనిచేయగలదు. ఆయనకు అందించబడుచుండినదేమిటో యేసు అర్థంచేసుకొన్నప్పుడు, ఆయన దానిని త్రాగుటకు నిరాకరించాడు.

యేసు సిలువ మీద ఉండిన చివరి గడియలలో, “దప్పిగొనుచున్నాను” అని పలుకుచూ ఆయన తన దాహము తీర్చబడవలెనని అడిగాడు. పాత నిబంధనలోని ఒక ప్రవచనము నెరవేరునట్లు ఆయన ఈ మనవి చేశాడని యోహాను చెప్పుచున్నాడు (యోహాను 19:28). నిస్సందేహంగా ఆయన కీర్తనలు 69:21బి ఉల్లేఖించి చెప్పుచుండెను: “నాకు దప్పియైనప్పుడు చిరకను త్రాగనిచ్చిరి.” ఈ కీర్తనకారుడు ఆయన అనుభవించుచుండిన ఒక భయంకరమైన తీర్పును వివరించుచుండెను, కానీ పరిశుద్ధాత్మ, యేసు సిలువ మీద పొందనై యుండిన శ్రమలలోని ఒక కోణాన్ని చిత్రీకరించుటకు ఆ మాటలను ఉపయోగించుచు, ఒక ఉన్నతమైన ఉద్దేశము నిమిత్తము, అతని మాటలకు నిర్దేశనము నిచ్చాడు.

“చేదు” గూర్చి కూడా ఈ కీర్తన పేర్కొనుచున్నది: “వారు చేదును నాకు ఆహారముగా పెట్టిరి” (కీర్తనలు 69:21ఎ). యేసును సిలువవేయుటకు సిద్ధము చేస్తూ ఆయనకు చేదు కలిపిన ద్రాక్షారసము ఇవ్వబడినప్పుడు ఈ పదజాలము నెరవేరుచుండినట్లు సువార్త రచయితలలో ఏ ఒక్కరును సూచించలేదు. ఏదిఏమైనా, ఆయనకు మొదట అందించబడిన ద్రాక్షారసమును త్రాగుటకు యేసు నిరాకరించుట కీర్తన కారుని పదజాలము చేత, అదే వచనంలోని రెండవ భాగంలో, తాజా శ్రాంతి పానీయము గల గిన్నెగా, మూడవ గిన్నెగా చిత్రీకరించబడుయుండును.

వారు ఆయనకు ఇచ్చుచుండిన ఉపశమనకారి ద్రావకమును త్రాగుటకు యేసు నిరాకరించుచు తన ముఖమును ప్రక్కకు త్రిప్పుకొనుటలో, వారు ఆయన హస్తములు మరియు పాదములలోనికి మేకులు దిగగొట్టుటకు యింకా కొన్ని క్షణములున్నాయనగా ఆయన ఏమని ఆలోచన చేయుచుండెనోయను అస్పష్టమైన క్షణికదృష్టిని చూచుచున్నాము, ఆయన ఆలోచనలను మూడు మాటల్లో వివరించవచ్చును.

*మొదటి మాట “తీర్మానము” ఆయన నిరాకరించుట* ఆయన తోటలో చేసిన నిబద్ధతను నెరవేర్చుటకు కలిగియుండిన తన దృఢసంకల్పమును యేసు వ్యక్తము చేయుచుండెను. తోటలో ఆయన తన తండ్రితో, “నా యిష్టము కాదు, నీ చిత్తమే సిద్ధించునుగాక” అని చెప్పాడు (లూకా 22:42). గిన్నెలోనిది పూర్తిగా త్రాగుట ఆయన తన తీర్మానము చొప్పున చేయుచుండినదై యుండెను. ఆయన దానిని పాక్షికంగా త్రాగుటకిష్టపడలేదు; దానినంతటిని

పూర్తిగా, చివరి చుక్క వరకు ఆయన దిగమ్రింగును. సిలువే తన తండ్రి చిత్తమైయున్నట్లయితే, యేసు దానిలోనిది ఏ భాగమునైనా వదిలిపెట్టడు.

రెండవ మాట "దృఢ నిశ్చయము" యేసు తనను తాను మన పాపముల కొరకు ఒక పావనమైన అర్పణగా సమర్పించుకొనుచుండగా స్పష్టమైన ఉద్దేశములతోను మరియు ఉండగలిగినంత మెలకువతోను ఉండవలెనను దృఢసంకల్పం కలిగియుండినాడు. సంభవించుచుండినదేదో అది యుగములన్నిటిలోను అతి గొప్ప సంఘటనయని ఆయన ఎరిగియుండెను. ఆయన లోక పాపముల నిమిత్తము దేవుని గొఱ్ఱెపిల్ల యగుచుండెను. ఆయన పాప ప్రాయశ్చిత్తార్థమై తనను తాను "ఒక్కసారే" అర్పించుకొనుచుండెను. మనము,

> ఏలయనగా మనలను దేవునియొద్దకు తెచ్చుటకు, అనీతిమంతుల కొరకు నీతిమంతుడైన క్రీస్తు శరీరవిషయములో చంపబడియు, ఆత్మవిషయములో బ్రదికింపబడి, పాపముల విషయములో ఒక్కసారే శ్రమపడెను అని చదువుచున్నాము (1 పేతురు 3:18; హెబ్రీయులకు 7:27, 28; 9:12 చూడుము).

ఆయన దేవుని నిత్య సంకల్పమును ఏదో మతిపోయిన స్థితిలో లేదా అర్ధచేతన స్థితిలో ఉండి చేసినట్లు నెరవేర్చడు. ఆయన ఆలోచించుటకును, ప్రార్థించుటకును, మరియు తన ప్రక్కలోనే ఉండిన పాపిష్టియైన మానవున్ని రక్షించుటకును చాలినంత అప్రమత్తంగా ఉండాలని ఆశించాడు.

మూడవ మాట *"క్రమశిక్షణ"* తన బాధను కొంతవరకైనా మొద్దుబారజేయగలిగిన గిన్నె నుండి తన ముఖమును ప్రక్కకు త్రిప్పుకొనుట ద్వారా దేవుని కుమారుని చేత బయలుపర్చబడిన ఆత్మనిగ్రహము గూర్చి ఆలోచించండి. ప్రతీ విషయము పూర్తిగా ఆయన అధీనములో ఉండెను. దేవుని చిత్తమును ఖచ్చితమైన మరియు నీతిమంతమైన క్రమశిక్షణ చొప్పున జరిగించునట్లు ఆయన ఇహలోక విలువలను మరియు తన శరీర సుఖములను తిరస్కరించాడు.

క్రీస్తు యొక్క గొప్ప నిశ్చయతను మనము ఇదివరకు చూశాము. ఆయన ఇహలోక పరిచర్య ముగింపునకు వచ్చుచుండినప్పుడు, "ఆయన పరమునకు చేర్చుకొనబడు దినములు పరిపూర్ణమగుచున్నప్పుడు, ఆయన యెరూషలేమునకు వెళ్లుటకు మనస్సు స్థిరపరచుకొనెను" అని లూకా చెప్పుచున్నాడు (లూకా 9:51, 52ఎ). "మనస్సు స్థిరపరచుకొనుట" అను మాటకు గ్రీకు భాషలో *sterizo* అని కలదు, ఇదొక శక్తివంతమైన పదము, "దృఢనిశ్చయముతో ఒకరి మనస్సును స్థిరపర్చుకొనుట, లగ్నము చేయుట, నిశ్చలముగా తీర్మానించుకొనుట లేదా దృఢంగా ఉంచుకొనుట" అని దీని అర్థము. ASV మరియు KJV బైబిల్లలో, "He stedfastly set his face to go to Jerusalem" అని వ్రాయబడియున్నది. NIV "Jesus resolutely set out for Jerusalem" అని వ్రాయబడియున్నది. యేసు తన ముఖమును యెరూషలేము వైపు పెట్టాడు. యిక అక్కడికి వెళ్లకుండా ఆయనను ఏ ఒక్కరైనను నిరోధించలేరు.

ఇక్కడ, సిలువయొద్ద, ఆయన దృఢసంకల్పమునకు సంబంధించినది అంతకన్నా గొప్పదైనా చిత్రమును మనము చూచుచున్నాము, ఆయన చిత్రహింసలు పెట్టబడుటకును ఆవేదన నొందుటకును మొదలుపెట్టినప్పుడు, తిమ్మిరెక్కించు ద్రాక్షారసమును ఆయన త్రాగకుండా ఉమ్మివేసి దేవుని చిత్తము మరియు ప్రణాళిక విషయములో మెలకువగా నుండు

స్పష్టమైనదియు, పరిశుద్ధమైనదైన మనస్సును ప్రదర్శించాడు. ఆ సమయంలో ఆయన మేకుల చేత సిలువకు కొట్టబడవలసినవాడై యుండినప్పుడు, యేసు సిలువ యొక్క సమస్త క్రోధావేశం వైపు తిరిగి, "సంపూర్తి స్పృహతోను నా సకలేంద్రియములు నా అధీనములో ఉండగాను, నీవు నా మీద మోపు బాధనంతా భరించుటకు నేను సంపూర్తిగా సంసిద్ధుడనై యున్నాను" అని పలికాడు.

చేదును, బాధను ఉపశమింపజేయు మాదకద్రవ్యము వంటి ద్రాక్షారసమును పుచ్చుకొనుటకు మన ప్రభువు నిరాకరించుట సిలువ ధ్యానముల అధ్యయనములలో చూచిచూడనట్లుండు ఒక చర్యయై యున్నది. అది మొదట ఒక సందర్భవశాత్తైన ప్రతిస్పందనగా, ఏదో వెగటు కలిగించు నటన అన్నట్లు అగుపించును. వాస్తవమునకు, ఆయన చేతులు దిగగొట్టబడు మేకులచేత చీల్చబడునట్లు వాటిని సైనికులు సిలువకొయ్యపై అదుముచుండినప్పుడు అది యేసు యొక్క మనోప్రవృత్తిని ప్రదర్శించినది. బలియాగము చేయు గడియను యేసు ఎదుర్కొనుచుండగా, ఆయన ఏమి ఆలోచించుచుండినట్లు? ఖచ్చితంగా ఆయన మనస్సంతా ఆయన సంపూర్ణంగా సమాప్తము చేయుచుండిన గొప్ప కార్యభారము మీదనే కేంద్రీకరింపబడి యుంటుంది. బహుశ ఈ మూడు మాటలు – "తీర్మానము," "దృఢనిశ్చయము," మరియు "క్రమశిక్షణ" – ఆయన జీవితములోని క్షణములన్నిటిలోకెల్లా అత్యంత పావనమైన క్షణములలోని ఆలోచనల ప్రవాహమును క్రోడీకరించగలవు.

❖◆❖◆❖

*"నిందయు సిగ్గును అవమానమును నాకు కలిగెనని నీకు తెలిసియున్నది; నా విరోధులందరు నీకు కనబడుచున్నారు. నిందకు నా హృదయము బద్దలాయెను నేను బహుగా కృషించియున్నాను. కరుణించువారికొరకు కని పెట్టుకొంటినిగాని యెవరును లేకపోయిరి, ఓదార్చువారికొరకు కని పెట్టుకొంటినిగాని యెవరును కానరారైరి. వారు చేదును నాకు ఆహారముగా పెట్టిరి నాకు దప్పియైనప్పుడు చిరకను త్రాగనిచ్చిరి" (కీర్తనలు 69:19-21).*